
# చెప్పరాని కథ

**-కోట రాధాకృష్ణమూర్తి**



**"డియర్ రాజా!**

నీ ఉత్తరం అందింది. సమాధానం వెంటనే రాయలేకపోయాను. అందుకు నన్ను క్షమించు. ఇచ్చట మేమంతా క్షేమం.

ఈమధ్య నేను ఓ చిన్నపనిమీద మద్రాసు వెళ్లాను. తిరుగు ప్రయాణంలో నాయుడు పేటలో దిగాను, రంగనాధం మాస్టారుగార్ని చూచివెళ్దామని పాపం! మాస్టారిగారి సంసారం చాలా చితికినట్లుంది. రిటైరై నాలుగు సంవత్సరాలైందట. చెట్టంత కొడుకు, చేతి కందిన కొడుకు ఏడాది క్రితం పోయాట్ట. గోరుచుట్టుమీద రోకటిపోటు అన్నట్టు మేస్టారిగారి అల్లుడు కూడా ఇటీవలే చనిపోయాడట. పాపం! పార్వతమ్మ అత్తగారింట్లోనే ఉంటున్నదట. మేస్టారుగారికి నిన్ను చూడాలని వుందట. వీలుచూసుకొని వొక్కసారి తప్పకుండా వెళ్లి చూసిరా.

ఇట్లు,
వాసు."

ఉత్తరం మడిచి జేబులో పెట్టుకొన్నాను. రాక్షసి బొగ్గు రవ్వల్ని నలువైపులా చిమ్ముకుంటూ చీకట్లను చీల్చుకుంటూ వెళ్తాన్నది రైలు. కంపార్టుమెంటులో దీపాలు కాంతి హీనంగా వెలుగుతున్నవి. రెండు సిగరెట్టు దమ్ములు ఘాటుగా లాగి ప్రయాణీకుల వంక కలియచూశాను. కొంతమంది ప్రయాణీకులు కూర్చొని కునికిపాట్లు పడుతున్నారు. మరికొందరు పక్కవాళ్ల భుజాలకు తలలానించి నిశ్చింతగా జోగుతున్నారు. ఓ దిక్కులేని ఆడకూతురు ఏడాది బిడ్డను వొళ్లో కూచోబెట్టుకొని బిత్తర చూపులు చూస్తున్నది. బహుశా టికెట్టు లేదుకాబోలు.

సన్నగా కూతవేస్తూ ఔటరు సిగ్నల్ దగ్గర రైలాగింది "నాయుడుపేట" అన్నారెవరో. కిటికీలోంచి తొంగిచూశాను. ఊళ్లో ఎలక్ట్రిక్ దీపాలు కన్పిస్తున్నాయి. మహానందంతో నా మనస్సు ఉరకలు వేస్తున్నది. ఏవేవో అనుభూతులు నన్ను వెన్నుతట్టి జ్ఞప్తికి తెస్తున్నవి. అవును. విద్యార్థిగా నాయుడుపేటలో గడిపిన రోజుల్ని నేను మరువలేను. పల్లెటూళ్ళో పుట్టి చదువు సంధ్యలు లేకుండా చెడిపోయిన నేను నాయుడు పేటలోనే ప్రయోజకుడనయ్యాను. అందుకు కారణం రంగనాథం మాస్టారు చెప్పిన చదువు. మేస్టారుగారి భార్య కమలమ్మ చేతిచలువ.

కిటికీలోంచి మళ్ళీ తొంగి చూశాను. ఔటర్ సిగ్నలు ఎర్రదీపం ధగధగ లాడుతోంది. ఏదో ఆలోచిస్తూ కళ్ళుమూసుకొన్నాను అప్రయత్నంగా నా మనస్సు వర్తమానం లోంచి గతంలోకి వెళ్ళిపోయింది. గత జీవితం తాలూకు దృశ్యాలు కొన్ని సినిమా తెరమీద బొమ్మల్లాగు కళ్ళలో మెదిలినై.

నాయుడుపేట బస్టాండు. "గూడూరు, నెల్లూర్" అంటూ బస్సుకండక్టర్ల కేకలతో, బస్సుల్లో ఎక్కిదిగే ప్రయాణీకులతో, పూలూ, పండ్లూ అమ్మే కుర్రాళ్ళ కేకలతో మహాసందడిగా వుంది. నేను పల్లెటూళ్ళో పుట్టాను. ఐదోక్లాసు వరకూ మావూరి ఎలిమెంటరీస్కూల్లో చదివాను. ఆ స్కూల్లో విద్యార్థుల సంఖ్య కంటే మేస్టార్ల సంఖ్య ఎక్కువ కావడం వల్ల చదువు బాగా రాలేదు ఎన్నడూ టౌన్లో కాలుపెట్టి ఎరుగను. రంగనాథం మాస్టారుగారికీ మానాన్నకూ మంచి స్నేహితం కావడంవల్ల, మేస్టారుగారి దగ్గర నన్ను చదివించాలని మా నాన్న సంకల్పం. అంచేత నన్ను వెంటపెట్టుకొని నాయుడుపేట తీసుకొచ్చాడు మా నాన్న. సంచీ చేత్తోపట్టుకొని బజారులో అంగళ్ళనీ, కాఫీహోటళ్ళనీ నోరుతెరుచుకొని చూస్తూ నడవడం ప్రారంభించాము రంగనాధం మాస్టారు గారింటికి, బస్టాండుకు అట్టే దూరంలేదు. బ్రాహ్మణవీధిలోనే మేస్టారి గారిల్లు. విశాలమైన వీధి. దాదాపు అన్నీ పూరిళ్ళే. ఇంటింటికీ పెద్ద పెద్ద అరుగులు. రోడ్డు కిరువైపులా గంగరావిచెట్లు గాలికి తలలూపుతున్నాయ్ మేము వెళ్ళేసరికి మాస్టారుగారు ఇంట్లోనే ఉన్నారు. మా నాన్నగార్ని చూడగానే ఆదరాబాదరా లేచి వచ్చి ఎంతో ఆప్యాయంగా ఇంట్లోకి తీసుకొని వెళ్ళారు. అమ్మగారు [మేస్టారుగారి భార్య కమలమ్మ] మా నాన్నగారికి కాళ్ళకు నీళ్లిచ్చి "బాగున్నారా అన్నయ్యగారూ?" అంటూ మా కుటుంబ యోగక్షేమాలు విచారించింది. మేస్టారుగారికీ, నాన్నగారికీ ఇంత స్నేహమని నాకు తెలీదు అందుచేత గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డాను. మాస్టారుగార్ని చూస్తుంటే నాలో ఏదో భయం పుట్టుకొచ్చింది. నల్లటి శరీరం, గుబురు మీసాలు, తీక్షణమైన చూపులతో భయంకరంగా ఉన్నాడాయన. చదువు మాట దేవుడెరుగు, ఈయన చేతిలో చావుమాత్రం ఖాయం అని మనసులో అనుకొన్నాను భోజనాలయ్యాక, నా చదువు గురించి మాట్లాడు కొంటున్నారు. "మీదే భారం" అంటున్నాడు మా నాన్న. "ఒరేయ్! నువ్వు పరాయివాడివా? వాడు నీ బిడ్డ కాడు. నాబిడ్డే! మరేం దిగులు పడకు" అంటున్నారు మాస్టారు. వాళ్ళ మాటల్ని బట్టి నన్ను మాస్టారుగారు వారింట్లోనే ఉంచుకొని చదివించడానికి వొప్పుకొన్నారని గ్రహించాను. మర్నాడు ఉదయం మా నాన్నగారు మా ఊరు వెళ్లిపోయారు. వెళ్లేటప్పుడు పదిరూపాయలు నా చేతిలో పెట్టి "వెధవా! శ్రద్ధగా చదువుకో లేకుంటే మేస్టారు తోలు వొలుస్తాడు" అంటూ నన్ను హెచ్చరించాడు మా నాన్న. వెళ్తాన్న మా

నాన్నని చూసి నా కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినై.

రెండు రోజుల తరువాత మేష్టారుగారు నన్ను నాయుడుపేట హైస్కూల్లో చేర్పించారు ఆ స్కూల్లో మాస్టారు కూడా టీచరుగా పని చేస్తున్నారు స్కూల్లో చేరాక ఒకటి,రెండు రోజులు ఒంటరితనం ఫీలయ్యాను. కానీ తర్వాత ఏమంతకష్టం అనిపించలేదు రోజూ ఆరింటికే నన్ను నిద్రలేపేవారు మేష్టారుగారు కాలకృత్యాలు తీర్చుకొన్నాక అమ్మగారు చద్దన్నం కలిపి వాళ్ళ పిల్లలకూ నాకూ ముద్ద లేసేది. కడుపు నిండినా ఇంకో ముద్ద. ఇంకోముద్ద అంటూ బలవంతంచేసేది. అమ్మగారి ముఖం చూస్తే చద్దన్నాల వేళప్పుడే చూడాలి. చిరునవ్వు ముఖంతో అన్నంకలుపుతూ, పిల్లలకు పెట్టేటప్పుడు సాక్షాత్తూ అన్నపూర్ణలాగే వుండేది ఆ తల్లి. చద్దన్నం తిన్నాక నన్ను అరుగు మీద కూర్చో బెట్టుకొని పాఠాలు చెప్పేవారు మాస్టారుగారు మేష్టరుగారు పాఠం చెప్పే పద్ధతి చాలా చిత్రంగా వుండేది ఒక్కో పాఠాన్ని ఐదారుసార్లు ప్రతి పదార్థంతో సహా చెప్పేవారు తర్వాత నోటు బుక్కులో అర్థాలు వ్రాసుకొని మర్నాటికి ఆ పాఠం అప్పజెప్పమనేవారు పాఠం మర్నాటికి అప్పజెప్పలేకపోతే చచ్చామన్నమాటె మొదట్లో కొంచెం కష్టమనిపించేది. కానీ క్రమంగా అలవాటైంది. శ్రద్ధగా చదువుకొని క్లాసు తప్పకుండా పరీక్షలన్నీ పాసవుతూ వొచ్చాను మేష్టారిగారి అభిమానాన్ని సంపాదించుకొన్నాను. నాయుడుపేటలో స్కూల్ ఫైనల్ దాకా చదివి, తర్వాత కాలేజీలో చదివి మేష్టారిగారి ఆశీర్వచన ప్రభావంవల్ల ఏదో ఈ నాటికి ప్రయోజకుణ్ణయ్యాను.

రెక్కవొంగింది. పెద్దగా కూతవేస్తూ రెండునిముషాల్లో నాయుడుపేట స్టేషను చేరుకొన్నది రైలు ఉదయం నాలుగున్నర కావస్తోంది. స్టేషను పంపుదగ్గర ముఖం కడుక్కొని కాఫీతాగి సంచీ చేత్తో పట్టుకొని ఊళ్ళోకి బయలుదేరాను. రోడ్డుమీద నడుస్తుంటే కాళ్ళ కిందపడి నలుగుతున్న ప్రతి మట్టి రేణువూ నన్ను పలకరించినట్లనిపించింది. జేబులోంచి ఉత్తరం తీసి అడ్రసు మరోసారి చూసుకొని మాస్టారిగారి ఇల్లు చేరుకున్నాను. అదోచిన్న పూరిపాక. చుట్టూ మురికి నీటి గుంటల్లో పందులూ, దోమలూ వీర విహారం చేస్తున్నవి. నాసికాపుటాల్ని బ్రద్దలు చేసే దుర్వాసన. శివశివా! మేష్టరుగారు ఈ దిక్కుమాలిన ఇంట్లో ఎలా కాపురం చేస్తున్నారో ?

తలుపు తట్టాను. 'ఎవరూ?' అంటూ తలుపు తీసి గుమ్మందగ్గర నిల్చున్న నన్ను ఎగాదిగా చూశారు మాస్టరుగారు. విల్లు బద్దలా ఒంగి ఉన్నారాయన ఒళ్ళంతా ముగ్గుబుట్టయింది. ముఖంలో మునుపటి గాంభీర్యమేలేదు భుజాలమీద వొక్కా చిరుగు అనుభవిస్తున్న దారిద్ర్యాన్ని నోరు విప్పి చెప్తున్నది నాకళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినై.

'నమస్కారం మాస్టారూ! నేనురాజును'' అంటూ ఆయన పాదాలకు వందనం చేశాను.

''నువ్వా : నాయనా ఎన్నాళ్ల కెన్నాళ్లకు అంటూ నన్ను లోపలకి తీసుకవెళ్ళారు మేష్టారు ఇల్లంతా కలియచూశాను చాలా చిన్న పూరిపాక మధ్య వెదుళ్ల తడిక ఒకటి అడ్డంపెట్టి రెండు గదులుగా విభజించినట్లుంది. గోడలకు బూజు వేలాడుతోంది. అటకమీద మేష్టారుగారు ప్రాణ ప్రదంగా చూచుకొన్న పుస్తకాలు చెల్లాచెదురుగా పడివున్నాయి ఇంట్లో దరిద్రదేవత చిందులు తొక్కుతున్నది. ఎటువంటి కుటుంబాని కెటువంటి దుర్గతి మనస్సుకు బాధ కల్గింది మాస్టారు ఏదో ఆలోచిస్తున్నారు ''విషయాలన్నీ వాసు ఉత్తరంలో రాశాడు మాస్టారు చాలా బాధ పడ్డాను ఇన్ని కష్టాల్లో మిమ్మల్ని చూడడం కేవలం నా దురదృష్టం'' అన్నాను వొణుకుతున్న కంఠంతో.

మేష్టారుగారు చిరునవ్వునవ్వి అంతా దైవ లీల ఉన్నట్లుగా చేతులు పైకెగురవేశారు

''మీ పిచ్చి మాస్టారూ. నిజంగా భగవంతుడనే వాడొకడుంటే మిమ్మల్నిలా కష్టపెట్టడు'' అన్నాను జేబు రుమాలతో కళ్ళు తుడుచుకుంటూ.

''తప్పు నాయనా తప్పు. నా ప్రారబ్ధం అనుభవిస్తున్నాను. అంతే!''

గంపెడు దుఃఖంలో కూడా ఇంత మనో నిబ్బరం ఎలా అలవర్చుకున్నారో మేష్టరుగారు. శారీరకంగా కృంగి పోయారేమోగాని, మానసికంగా చెక్కు చెదరలేదు. భగవంతునిలో విశ్వాసం సడలలేదు. మాస్టరుగారు స్థితప్రజ్ఞులు బుషుల కోవకు చెందినవారు. అందుకేమాత్రం సందేహంలేదు

ఏదో చప్పున స్ఫురణకు వచ్చినట్లుగా మేష్టారూ 'అమ్మగారు కన్పించరేం!' అన్నాను ఆదుర్దాగా.

నా ప్రశ్నకు మాస్టారుగారు కొంచెం కలవరపడి '' ఊరెళ్లింది బాబూ '' అన్నారు పరధ్యానంగా.

నాకు నిరాశ కల్గింది. ఊర్నించి వచ్చేటప్పుడు నేను మాస్టారుగారికీ, అమ్మగారికీ కొత్త బట్టలు తెచ్చాను పార్వతీపరమేశ్వరుల్లాంటి దంపతులిద్దరూ అవి కట్టుకుంటే చూసి పాదాభివందనం చేద్దామనే సంకల్పంతో గంపెడాశతో వొచ్చాను. ఇంతకీ ప్రాప్తంలేదు ఆ విషయమే మాస్టారుగారితో చెప్పి సంచిలోంచి బట్టల పాకెట్లు బయటకు తీసి, ఆ పొట్లాల్లు, పది, పదిరు పాయల నోట్లు గురువుగారి చేతిలోపెట్టి నమస్కరించాను.

''ఏమిటినాయనా ఏమిటిదంతా'' అంటూ వాత్సల్యంతో నా తల నిమిరారు మాస్టరుగారు. ''నా సంతోషం మాస్టారూ మీరు అభ్యంతరం చెప్పకూడదు'' అంటూ ఆయన కళ్లల్లోకి చూశాను. మాస్టారుగారి కళ్ళు ఆనందాశ్రువులు స్రవిస్తున్నాయి. ఆహా! అదృష్టమంటే నాదే. ఏదో ఉడతా భక్తిగా ఈనాటికి గురువుగారిని సత్కరించే అవకాశం నాకు లభించింది. కానీ ఒకటే కొరత సమయానికి అమ్మగారు ఇంటిలో లేరు.

''మాస్టారుగారూ : అర్జంటు పనిమీద మద్రాసు వెళ్తున్నాను. మళ్లీ ఎన్నాళ్లకో అమ్మగారిని చూడలేక పోయాను. దురదృష్టవంతుణ్ణి, శలవు తీసుకొంటాను'' అన్నాను చేతులు జోడించి.

ఆవలి గదిలోంచి సన్నగా గాజుల చప్పుడు. ''బాబూ !'' అంటూ దీనంగా పిలుపు.

''నా చెవులను నేనే నమ్మలేక పోయాను. ఏమిటీ: అమ్మగారింట్లోనే ఉన్నారా? ఇంట్లోనే వుంటే లేరని మాస్టారుగారు నాతో అబద్ధమాడారా? అమ్మగార్ని నేను చూడటానికి అవకాశం లేదా? కారణం. నేనేమన్నా తప్పు చేశానా? కారణమేమిటి ?''

'వెళ్ళి చూడు నాయనా చూడు''అన్నారు మాస్టారు దాదాపు శిలా విగ్రహంలాగా నిలబడ్డ నన్నుచూసి.

''అమ్మగారూ'' అంటూ లోపలికి వెళ్లి తొంగిచూశాను శివా. శివా: ఈ కథ ఇక వ్రాయలేను. కలం తిరుగుబాటు చేస్తున్నది. నన్ను క్షమించండి, కమలమ్మగారికి కట్టుకోడానికి చీరలేదు కాబోలు మాస్టారుగారి పాత పంచె ఒకటి వొంటికి చుట్టుకొని ఉన్నది. గొంతుకూర్చుని ముఖాన్ని రెండు చేతులతో కప్పుకొని ఏడుస్తున్నది. అమ్మా! కమలమ్మ తల్లీ!